క్లుప్తంగా

కొనసాగుతున్న సర్వే

మధురపూడి: కోరుకొండ మండలంలో లెప్రసీ కేస్ డిటక్షన్ క్యాంపియన్ (ఎల్‌సీడీసీ) సర్వే కొనసాగుతున్నట్టు కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్ ప్రజ్ఞ తెలిపారు. ఈ నెల 18వ తేదీ ప్రారంభమైన ఈ సర్వే ఆగస్టు 2వ తేదీ వరకూ జరుగుతోందన్నారు. పీహెచ్‌సీకి వస్తున్న ప్రతి అనుమానిత చర్మవ్యాధుల కేసునూ పూర్తిస్థాయిలో పరీక్షిస్తామన్నారు. దీనికి ప్రజలు సహకారం అందించాలన్నారు. తమ సర్వే బృందం ఇంటింటికీ ప్రజలకు పరిశీలిస్తున్నట్టు తెలిపారు. పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించిన తర్వాతే బాధితులకు వైద్యసేవలు అందిస్తామన్నారు.

విశ్రాంత అధ్యాపకుడి మృతికి సంతాపం



ఆచార్య బాలకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ ఇన్‌చార్జి వీసీ తదితరులు

రాజానగరం: రాజనీతి శాస్త్ర విశ్రాంత అధ్యాపకుడు, ఆచార్య బీవీవీ బాలకృష్ణ మృతికి ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఆయన సహచరులు తీవ్ర సంతాపం తెలిపారు. ఈ మేరకు సెమినార్ హాలులో సోమవారం నిర్వహించిన సంతాప సభలో బాలకృష్ణ చిత్రపటానికి ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగా 36 ఏళ్లు ఆయన అందించిన సేవలను పలువురు వక్తలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలని వినతి

మధురపూడి: కోరుకొండ సాయినగర్‌లో పారిశుధ్యం మెరుగుపరిచి, ఆరోగ్యాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు ఎక్కువైపోయాయని, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వేదిక కార్యక్రమంలో ఎంపీడీఓ హేమసుందరరావు, ఎంఈఓ కుశల వదొర, ఉద్యానవనశాఖ అధికారి రిని తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో దివ్యాంగులకు పరీక్ష శిబిరం

పెదపూడి: కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆగస్టు 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దివ్యాంగులకు అవసరమైన పరికరాలు ఇవ్వడానికి పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ట్రై సైకిళ్లు, హియరింగ్ పాడ్స్ తదితర వాటిని ఇవ్వనున్నట్టు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న దివ్యాంగులు, పింఛను లబ్ధిదారులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నరేష్ కుమార్



మధురపూడి: కోరుకొండ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఎస్.నరేష్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా తహసీల్దార్‌గా వచ్చిన డి.రాజ్యలక్ష్మి ఆదివారం బదిలీ అయ్యారు. దీంతో ఇన్‌చార్జిగా నరేష్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.


చంద్రశేఖర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చంద్రశేఖర స్వామి

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామివారికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు.

నేడు మోదకొండమ్మ జాతర



మోదకొండమ్మతల్లి

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామ దేవత మోదకొండమ్మ జాతర మంగళవారం వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా 300 మంది కళాకారులు ప్రదర్శనలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన గ్రామంలోని ప్రధాన వీధులలో కొనసాగుతుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరవుతారు.

శుద్ధ జలగాటం!

- నిబంధనలు పాటించని ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వాహకులు
- మినరల్ వాటర్‌పై ఆధారపడ్డ ప్రజలు
- తనిఖీలు చేయని అధికార యంత్రాంగం
- వానా కాలంలో వ్యాధులు సోకే అవకాశం



రంగంపేట మండలంలో ఓ ఆర్‌ఓ ప్లాంట్ నుంచి నీటి శాంపిల్ సేకరిస్తున్న అధికారులు



ఆర్‌ఓ ప్లాంట్లలో నీటి నాణ్యతకు చేస్తున్న పరీక్షలు

రంగంపేట: ప్రాణకోటికి జీవనాధారమైన జలం కాస్తా గరళంగా మారుతోంది. కొందరి స్వార్థానికి కలుషిత నీరే ప్రజలకు దిక్కవుతోంది. ధనార్జనే ధ్యేయంగా జనాల రక్తాన్ని పీల్చుతున్న జలగలు.. ఇప్పుడు శుద్ధ జలాన్ని తమ పావుగా వాడుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో నియోజకవర్గంలో ఆర్‌ఓ(శుద్ధజల) ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొందరు నిర్వాహకులు పూర్తి స్థాయిలో అనుమతులు తీసుకోకుండానే ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వారి వ్యాపారం జోరుగానే సాగుతోంది.

నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో 11 పంచాయతీల్లో అనపర్తి, కుతుకులూరు, మహేంద్రవాడ, రామవరం, పొలమూరు మేజర్ పంచాయతీలు ఉన్నాయి. పెదపూడి మండలంలో 18 పంచాయతీల్లో పెదపూడి, దోమాడ, శహపురం, పెద్దాడ, అచ్యుతాపురం, జి.మామిడాడ మేజర్ పంచాయతీలున్నాయి. బిక్కవోలు మండలంలో 13 పంచాయతీల్లో బిక్కవోలు, ఊలపల్లి, బలభద్రపురం, తొస్సిపూడి, కొంకుదురు, కొమరిపాలెం, రంగంపేట మండలంలో 17 పంచాయతీల్లో రంగంపేట, వడిశలేరు మేజర్ పంచాయతీలు ఉన్నాయి. గతంలో ప్రతి గ్రామంలోను మంచి నీటి బావులు, తాగు నీటి చెరువులుండేవి. భూగర్భ జలాలు కలుషితమై బావులు, చెరువుల్లో నీరు రంగు మారడం, చెత్తాచెదారం చేరడంతో, ప్రజలు ఆ నీటిని తాగడం మానేశారు. మినరల్ వాటర్ పేరిట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్లాంట్ల వద్ద లేదా ఇంటింటికీ ఆటోల ద్వారా టిన్నుల్లో సరఫరా చేస్తున్న నీటినే ప్రజలు మినరల్ వాటర్‌గా భావించి తాగుతున్నారు. ప్లాంట్ వద్ద కొనుగోలు చేస్తే ఒక టిన్ను(20 లీటర్లు) ఖరీదు రూ.10 నుంచి రూ.15, ఆటోలో ఇంటి వద్ద తెచ్చిస్తే టిన్ను రూ.20 నుంచి రూ.30 వసూలు చేస్తున్నారు. కూలింగ్ టిన్నులైతే రూ.30 నుంచి రూ.50 వరకు తీసుకుంటున్నారు.

లైసెన్సులు తప్పనిసరి

ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసేటప్పుడు అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలింగ్ అధికారులు, కార్పొరేషన్ నుంచి తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలి. స్థానిక ఎంపీడీఓ, పంచాయతీ అధికారులు కూడా స్వయంగా పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే లైసెన్స్ మంజూరు చేయాలి. కానీ ఇవేమీ జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. సరైన ప్రమాణాలు పాటించకుండానే కొందరు నిర్వాహకులు ప్లాంట్లు నడుపుతున్నారు.

మినరల్ అనుకుంటే పొరబాటే..

అన్ని ఆర్‌ఓ ప్లాంట్లలో అమ్మేది మినరల్ నీరని చాలా మంది అపోహ పడుతుంటారు. కొన్ని ప్లాంట్ల నిర్వాహకుల నిర్వాకం ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతోంది. సాధారణంగా నీళ్లలో సోడియం సల్ఫేట్, కాల్షియం కార్బొనేట్, పొటాషియం, మెగ్నీషియం సల్ఫేట్ లాంటి కొన్ని ఖనిజాలను అదనంగా కలిపితే, దానిని మినరల్ వాటర్ అంటారు. ఈ ప్రక్రియను కేవలం కొన్ని కార్పొరేట్ కంపెనీలు మాత్రమే చేస్తాయి. గ్రామగ్రామాన వెలుస్తున్న అన్ని ప్లాంట్లు ఇలా సూక్ష్మస్థాయిలో శుద్ధి ప్రక్రియను అవలంబించడం లేదని చెబుతున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడమే శ్రేయస్కరమని వైద్యులు సూచిస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి



నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న అనేక గ్రామాల్లో మినరల్ వాటర్ పేరిట ఏర్పాటు చేసిన ప్లాంట్లను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. కచ్చితంగా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? నీటి పరీక్షలు చేస్తున్నారా? లేదా? డబ్బాలు ఎలా ఉన్నాయి? పరిసరాలు ఎలా ఉన్నాయో పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

– కె.సత్యనారాయణ, సామాజిక కార్యకర్త, రంగంపేట

నాణ్యత పరీక్షలకు ఆదేశాలు



గ్రామాల్లో నిర్వహించే ఆర్‌ఓ ప్లాంట్లలో నీటి నాణ్యతను పరీక్షించాలని మండల ఇంజినీరింగ్, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. పంచాయతీ అధికారులను పర్యవేక్షణ చేయమన్నాం. ప్రస్తుతం వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రతి గ్రామంలోని ప్లాంట్లలో నీటి శాంపిల్స్ సేకరించి సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్వయంగా నేను కూడా పర్యవేక్షిస్తాను.

– పి.వెంకటరత్నం, ఎంపీడీఓ, రంగంపేట మండలం

స్టీల్ ట్యాంకులను వాడాలి

వాస్తవానికి ఆర్‌ఓ ప్లాంట్లలో స్టీల్ ట్యాంకులనే వాడాలి. చాలామంది ఇలాంటి నిబంధనలు పాటించడం లేదు. 15 రోజులకోసారి ట్యాంకులను శుభ్రపరిచి, ట్యాంకుపై రాయాలి. ప్లాంటు సమీపంలో మురుగు కాలువలు ఉండరాదు. ఆర్‌ఓ ప్లాంట్ పేరిట నీటిని ప్లాస్టిక్ ట్యాంకుల్లో పట్టి వీధుల్లోకి వెళ్లి అమ్ముతున్నారు. ఈ ట్యాంకులను శుభ్రపర్చడం లేదు. టిన్నులను ఆరు నెలలకోసారి మార్చి, కొత్తవి వినియోగించాలి. కొన్ని ప్లాంట్ల యజమానులు అలా చేయడం లేదు. అవే టిన్నులను ఏళ్ల తరబడి వినియోగిస్తున్నారు.

సమస్యలుంటే కంట్రోల్ రూమ్‌కు తెలపాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రంగంపేట: ఆగస్టు ఒకటిన పంపిణీ చేసే సామాజిక భద్రత పింఛను కార్యక్రమంలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే మండల పరిషత్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఎంపీడీఓ పి.వెంకటరత్నం అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయాల్లో ఇతర కార్య నిర్వాహక సిబ్బందితో ఆయన పింఛన్ల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 8,970 మంది పింఛను లబ్ధిదారులున్నారని, వారికి రూ.3,79,15,500 విడుదలైనట్టు చెప్పారు. ఈ మొత్తాన్ని ఆగస్టు ఒకటిన సంబంధిత అధికారులు వారికి కేటాయించిన గ్రామ క్లస్టర్లలో ఇంటింటికీ వెళ్లి, బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ ద్వారా లబ్ధిదారులకు ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు నగదు అందించాలని వివరించారు. ఎక్కడైనా సాంకేతిక సమస్య తలెత్తితే రెండో తేదీన పంపిణీ పూర్తి చేసి, సాయంత్రానికి ముగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎం. వెంకటేశ్వరరావు, ఎంఈఓ కె.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సీతానగరం: మండలంలోని చీపురుపల్లి చెందిన బిల్లా వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో అతడి తల్లి కృతిదుర్గకు సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు సోమవారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

మనిషి అత్యాశతోనే పర్యావరణ విధ్వంసం



ముఖ్యఅతిథి యూసఫ్ బాషాను సత్కరిస్తున్న అధ్యాపకులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, జంతుశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ పంచభూతాలను కలుషితం చేయడం వల్లనే భూతాపం పెరిగి అనేక వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ షేక్ యూసఫ్ బాషా మాట్లాడుతూ మానవుని అత్యాశ, ఆలోచనారాహిత్యాలే ప్రకృతి విధ్వంసకారకాలన్నారు. యువత పర్యావరణ హితమైన జీవితాన్ని అవలంబించి, ప్రకృతి సమతుల్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం యూసఫ్ బాషాను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎం.సుధామయి, డాక్టర్ మాధవ్, వాణి, అలేఖ్య, సుబ్బారావు, మీనాక్షి, ఫణీంద్ర, వెంకటేష్, షేక్ మదీనా పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై శిక్షణ



అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో కాకినాడ గ్రూప్ 18 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ కేడెట్లకు సోమవారం అగ్ని ప్రమాదాల సమయంలో అనుసరించే పద్ధతులపై అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం అగ్నిమాపక దళం అధికారులు, సిబ్బంది ఇక్కడకు వచ్చి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అలాగే శిక్షణలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఎన్‌సీసీ కేడెట్లు శ్రమదానం చేశారు. ఆస్పత్రి ఆవరణ, పరిసరాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కమాండర్ మహ్మద్ ఆసిఫ్, ఏఎన్ఓ తేజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పురోహిత సంఘం ఏర్పాటు



నూతన కార్యవర్గ సభ్యులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో వేద గాయత్రీ బ్రాహ్మణ పురోహిత సంఘాన్ని ఏర్పాటు చేశారు. సీతానగరం రాజుగారి కల్యాణ మండపంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ పురోహిత సమాఖ్య మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సమాఖ్య అధ్యక్షుడు జ్యోతుల సుబ్రహ్మణ్య శర్మ, జిల్లా అధ్యక్షుడు వర్ల సీతారామశాస్త్రి (రాజా), జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరాధ్యుల నరేంద్ర బాబు శర్మ, జిల్లా అధికార ప్రతినిధి వెలువంటి రాజా శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో వేద గాయత్రీ బ్రాహ్మణ పురోహిత సంఘాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా బదిరాజు భాస్కర రామశర్మ (దత్తుడు), అధ్యక్షుడిగా మండ వీర వెంకట సోమేశ్వరశర్మ (సోంబాబు), ఉపాధ్యక్షుడిగా కొత్తూరు సూర్యానారాయణమూర్తి శర్మ, కార్యదర్శిగా కొత్తూరు వెంకట రమణ శర్మ ఎన్నికయ్యారు.

ఓఆర్ఎస్‌పై అవగాహన కార్యక్రమం



బొబ్బిల్లంకలో ఓఆర్ఎస్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: వరల్డ్ ఓఆర్ఎస్ డే సందర్భంగా బొబ్బిల్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈ.ఏసురాణి మాట్లాడుతూ విరేచనాలు, వడదెబ్బ, ఇతర కారణాలతో శరీరం నుంచి నీరు, పోటాషియం, సోడియం, క్లోరైడ్ వంటి లవణాలు బయటకు వెళ్లిపోయినప్పుడు ప్రాణాపాయస్థితి సంభవిస్తుందన్నారు. ఆ సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లలో పౌడర్‌ను నీటిలో కలిపి రోగికి తాగిస్తే ప్రయోజనం కలుగుతుందన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రతి గ్రామంలోనూ ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల వద్ద ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మేఘన, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంతి పాల్గొన్నారు.

శాకంబరిగా రాజరాజేశ్వరీదేవి



రాజానగరం: స్థానిక రాజలింగేశ్వరస్వామి, రాజగోపాలస్వామి ఆలయాల సముదాయంలో కొలువైన రాజరాజేశ్వరిదేవి సోమవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



జి.మామిడాడ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



పందలపాకలో స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్‌లు



దాత సోమన్నచౌదరిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పెదపూడి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని జి.మామిడాడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో చివరి రోజు విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమం చేయించారు. అలాగే తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. తిథి భోజనం సందర్భంగా విద్యార్థులకు దాతల సాయంతో రుచికరమైన భోజనం అందజేశారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నోట్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి, మాజీ ఎంపీటీసీలు తమలంపూడి శివరామారెడ్డి, జుత్తక సూరిబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పందలపాకలో..

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో ఉన్న పడాల పెద పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో సోమవారం తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. శిక్షా సప్తాహ్ చివరి రోజులో భాగంగా తొస్సిపూడి సర్పంచ్ సీతారత్నం, నందిని చారిటబుల్ ట్రస్ట్ అధినేత కొవ్వూరి వెంకటరెడ్డి దంపతులు విద్యార్థులకు అరటి పండ్లు అందించారు. పందలపాక సర్పంచ్ సబ్బారపు పద్మావతి మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, స్కూలు అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, పీడీ యువరాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ సబ్బారపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాతలు సహకరించాలి

రంగంపేట: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని స్థానిక మర్రిపూడి పుట్టా శ్రీనివాస్ స్మారక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రవికుమార్ కోరారు. మధ్యాహ్న భోజన పథకం ఒకరోజు దాతల సత్కార సభ సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా దాత పుట్టా సోమన్నచౌదరి మాట్లాడుతూ 250 మంది విద్యార్థులకు భోజన పథకంలో తనను భాగస్వామిని చేయడం ఆనందంగా ఉందన్నారు. వచ్చే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు సత్కరించారు.

ఏడీబీ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు

సాక్షి ఇంపాక్ట్

రాజానగరం: రాజానగరం – కాకినాడ ఏడీబీ రహదారి అభివృద్ధి పనులను త్వరలోనే పునఃప్రారంభించి, పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.శ్రీకాంత్ తెలిపారు. 'దారి పొడవునా భారీ గోతులు' అంటూ సోమవారం 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సామర్లకోట నుంచి రాజానగరం వరకు 30 కిలోమీటర్ల మేరకు విస్తరణ, పటిష్టపరచే పనులను రూ. 293 కోట్లతో ఏడీబీ, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో చేపట్టామన్నారు. దీనిలో 21 కిలోమీటర్ల మేర పనులు పాక్షికంగా పూర్తయ్యాయన్నారు. ఈ నెల 17న గోవిందరాజపురం వద్ద తూరలు అమర్చుతూ తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టామన్నారు. కాంట్రాక్టరుకు చెల్లించాల్సిన బకాయిలకు విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపించామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెదపూడి: అనపర్తి గ్రామం శివారు కొత్తూరు ఖాళీ స్థలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై కె.రామారావు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు, మృతుడికి 50 నుంచి 55 ఏళ్ల వయస్సు ఉంటుంది. మూడు రోజులుగా అనపర్తి, పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా, కేవలం టవల్ కట్టుకుని తిరిగేవాడు. వీఆర్వో కె.రవికుమార్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు విందు భోజనం



రాజానగరం హైస్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు స్వీట్లు అందజేస్తున్న దాతలు



గాడాల హైస్కూల్లో భోజనాలు సిద్ధం చేసిన నాయకులు, ఉపాధ్యాయులు



రాపాక స్కూల్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

రాజానగరం: విద్యార్థులలో దాగిన ప్రతిభ, సృజనాత్మకతను ప్రోత్సహించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులు నిర్వహించిన శిక్ష సప్తాహ్ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. ఈ వారం రోజులూ విద్యార్థులకు ఆటలు, పాటలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆఖరి రోజు పలుచోట్ల ఆయా గ్రామాలకు చెందిన దాతల సహకారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు స్వీట్లు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. రాజానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ రాజ్ కుమార్, మాజీ చైర్మన్లు, గ్రామ పెద్దలు కొణతం నరసింహరావు, పి.నారాయణస్వామి, మాచిరెడ్డి సత్తిరాజు, శ్రీనివాస్, ఉపాధాయులు పాల్గొన్నారు.

గాడాల హైస్కూల్లో..

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈనెల 22వ తేదీన ప్రారంభమైన శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 600 మందికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. హెచ్ఎం నిర్మలా జ్యోతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టిన న్యూ ఎడ్యుకేషన్ పాలసీకి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. దాతలు పడాల పండు, అడ్డాల శివ, డేగపాటి వెంకన్న, గాదంశెట్టి వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సీతానగరం: రాపాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు భోజనం అందించారు. దాత ఎస్.చంద్రకళ సాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భోజనంలో ప్రభుత్వం అందించే మెనూతో పాటు బూరెలు, అరటిపండు, స్వీట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా ఎంఈవో కె.స్వామినాయక్ హాజరయ్యారు. హెచ్ఎం ప్రేమ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1న ఉచిత మెగా వైద్య శిబిరం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు ఒకటిన ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. పందలపాక గ్రామంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు ఒకటిన మూలారెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానిక ఐఎంఏ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని రకాల వ్యాధులతో పాటు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. అలాగే పందలపాకలో మూలరెడ్డి విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి స్పీకర్ సీహెచ్ అయ్యన్న పాత్రుడు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.